క్లుప్తంగా

త్వరలోనే నీటి సరఫరా అంతరాయాలకు చెక్

కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని నీటి సరఫరా ప్రధాన పైపులైన్ తరచు పగిలి లీకేజీలతో ఏర్పడుతున్న నీటి సరఫరాకు అంతరాయానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘు శనివారం ఒక ప్రకటనలో కోరారు. లీకేజీలు ఎప్పటికప్పుడు సరి చేస్తున్నా ప్రస్తుతం ఉన్న ప్రధాన పీఎస్సీ పైపులైన్ వేసి దాదాపు 30 ఏళ్లు గడిచినందున రేగళ్ల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు మధ్యన పగుళ్లు ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి మంజూరైన నిధులతో నూతన పైపులైన్ వేసేందుకు నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఇరవై రోజుల్లో పనులు ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తి చేస్తామని, తదుపరి ఎలాంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

కార్మికులకు కొత్త జీతాలు

ఇల్లెందు: టీజీబీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కవిత, వెంకటరావు, రాజిరెడ్డి, కెంగర మల్లయ్యల కృషి వల్లె ఈ నెల నుంచి కార్మికులకు కొత్త జీతాలు అందనున్నాయని టీజీబీకేఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ స్పష్టం చేశారు. శనివారం ఇల్లెందులో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేజ్‌బోర్డు పూర్తయినందున ఇప్పటికే అందించాల్సిన వేతనాలు జూన్ నెల నుంచి అందజేసేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు.

కొత్త నాటకానికి తెరలేపిన టీజీబీకేఎస్..

జాతీయ కార్మిక సంఘాలు పోరాడి సాధించిన నూతన వేతన ఒప్పందాన్ని తామే ఇప్పించినట్లు ప్రచారం చేసుకుంటూ టీజీబీకేఎస్ కొత్త నాటకానికి తెరలేపిందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య తెలిపారు. ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రితో ఐదు దఫాలు చర్చించి ఉత్తర్వులు జారీ చేయించగలిగామన్నారు.

విద్యార్థులకు అభినందన

జూలూరుపాడు: స్థానిక ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులు 6వ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా వారిని శనివారం తహసీల్దార్ శారద అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ ఆరబోయిన కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు పుల్లారావు, అశోక్‌రావు, శివకుమారి, అనూష, నబీనా, అనిత, జమున, సాహితీ, విజయ, భవానీ, సౌజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అటెండర్ మృతికి సంతాపం

టేకులపల్లి: టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు పంచాయతీకి చెందిన కేజీబీవీ పాఠశాల అటెండర్ అజ్మీరా మంగమ్మ (52) శనివారం మృతి చెందింది. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. ఆమె భర్తతో పాటు కుమారుడు, వార్డుమెంబర్ రాంకిషోర్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్ బానోతు హరిసింగ్, సర్పంచ్ మాలోతు సురేందర్ తదితరులు పరామర్శించి మంగమ్మ మృతిపై సంతాపం ప్రకటించారు.

ప్రగతిభవన్ ముట్టడికి తరలిరండి

ఇల్లెందు: ఈ నెల 30న నిర్వహించనున్న ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం జగదాంబా సెంటర్ ప్రగతి భవన్ ముట్టడి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. హెల్త్ డైరెక్టర్‌గా ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన గడల శ్రీనివాసరావు అందుకు భిన్నంగా ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలు, కేశవ్ నాయక్, రమేష్, గుగులోత్ కవిత, రాము, వెంకన్న, సిద్దు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల సందర్శన

పాల్వంచరూరల్: మండల పరిధిలోని సోములగూడెం, బసవతారక కాలనీలోని నర్సరీలను, కొత్తసూరారం బృహత్ పల్లెప్రకృతి వనాన్ని శనివారం ఎంపీడీఓ బి.అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వనాల్లో చనిపోయిన మొక్కల స్థానాల్లో కొత్తవి నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రంగా, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న జరిగే హైద్రాబాద్‌లో ప్రజాపంథా మార్గదర్శకుడు డీవీ కృష్ణ వర్థంతి కార్యక్రమం పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పెద్దబోయిన సతీష్ శనివారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రజుమంలో చంద్రశేఖర్,ఉమా, స్రూజన్, నాగ ప్రసాద్, రమేష్, సాత్విక, లోకేష్, సాయి, ప్రణయ్ పాల్గొన్నారు.

అంతా అయింది.. లైట్లు ఏవీ?!

రోడ్డు విస్తరణ, డివైడర్లు నిర్మించినా స్తంభాలు, లైట్ల ఏర్పాటులో జాప్యం

- కేఎస్‌పీ రహదారిలో అసంపూర్తి పనులతో ఇక్కట్లు
- నెలలుగా పట్టించుకోని పాలకులు, అధికారులు


కేఎస్‌పీ రోడ్డులో నిలిచిన సెంట్రల్ లైటింగ్ పనులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీలో ఎన్నో దశాబ్దాల కాలంగా కోరుతున్న కేఎస్‌పీ రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు గత డిసెంబర్‌లో ప్రారంభమయ్యాయి. కానీ ఆరు నెలలు గడుస్తున్నా పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి రహదారిని విస్తరించారు. ఆపై పాత రోడ్డుపై తారు పోసి కొత్త రోడ్డు వేశారు. మధ్యలో డివైడర్ కూడా నిర్మించారు. అంతేకాక కల్వర్టులు, ఎలక్ట్రికల్ టవర్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంకేముంది అంతా అయిపోయిందని స్థానికులు సంతోషిస్తున్న క్రమంలోనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. మూడు నెలలుగా ఈ పనులు ముందుకు సాగకపోయినా అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెలల తరబడి పెండింగ్..

పాల్వంచలోని అంబేడ్కర్ సెంటర్ నుండి నటరాజ్ సెంటర్ మీదుగా అల్లూరి సెంటర్ వరకు సుమారు కిలోమీటర్ మేర రూ.5 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ పనుల ఆది నుండి మందకొడిగానే జరుగుతున్నాయి. ఎలక్ట్రికల్ టవర్ల నిర్మాణాలు సైతం పూర్తి కాగా, డివైడర్ మధ్యలో మాత్రం స్తంభాలు, లైట్ల బిగింపు పనుల్లో ఎడతెగని ఆలస్యం జరుగుతోంది. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయితే డివైడర్లకు రంగులు వేసి ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ అధికారుల్లో సమన్వయం లోపం కారణంగానే ఈ పనులు జరగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా త్వరగా మిగులు పనులు పూర్తిచేసి వెలుగులు పంచాలని పట్టణ వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులే మిగిలాయి



రోడ్డు నిర్మాణం, డివైడర్, కల్వర్టులు, ఎలక్ట్రికల్ టవర్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. సెంట్రల్ లైటింగ్ పనులకు ఎస్టిమేషన్ సిద్ధం చేశాం. ఆపై ఎస్‌ఈ నుండి అనుమతి కోసం పంపించాం.

– వంశీ, ఏఈ, ఆర్‌అండ్‌బీ

జెన్‌కో సీఎండీకి వినతుల వెల్లువ


సీఎండీ వినతి పత్రం అందజేస్తున్న 1535 సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు వజీర్

పాల్వంచ: కేటీపీఎస్‌లో శనివారం టీఎస్ జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు పర్యటన సందర్భంగా పలు సమస్యలపై వినతులు సమర్పించారు. కేటీపీఎస్ ఓఅండ్‌ఎంలో విలీనం కాకుండా మిగిలిపోయిన 318 మంది ఐడీ నంబర్లు కలిగి ఆన్‌లైన్ ప్రాసెస్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్‌లుగా తీసుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందించారు.

- టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర జెన్‌కో సెక్రటరీ చారుగుండ్ల రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి ఫెన్షన్ సౌకర్యం కల్పించాలని, రెండో సారి వారసత్వంగా కారుణ్య నియామకాలు తీసుకోవాలని, కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో అంతర్గత రహదారులు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాస్, తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, నారందాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్(1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎం.ఎ.వజీర్ ఆధ్వర్యంలో జీపీఎఫ్ కల్పించాలని, బీటీపీఎస్ ఉద్యోగులకు షిఫ్ట్ అలవెన్స్ మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

దేవస్థానం షాపులు అమ్మినా, కొన్నా శిక్షార్హులు


షాపును తనిఖీ చేస్తున్న ఈఓ సులోచన

కొత్తగూడెంటౌన్: దేవస్థానం షాపుల విషయం కోర్టులో కేసులు నడుస్తున్నందున ఎవరైనా షాపులను అమ్మినా, కొన్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గణేష్ టెంపుల్ ఈఓ సులోచన హెచ్చరించారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు పరిధిలోని దేవాదాయ ధర్మాదాయశాఖ కామేశ్వరమ్మ సత్రం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కన షాపు నంబర్ 77ను రూ.80 లక్షలకు అమ్ముకున్నారనే సమాచారంతో శనివారం షాపులో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా షాపులో ఉన్నవారిని విచారించామన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే తనకు ఫిర్యాదు చేయాలన్నారు.

మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి


నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: భవిష్యత్‌లో యువత ఏ అంశంపైన పోరాటాలు చేయాలన్న మానసిక, శారీరకంగా దృఢత్వం తప్పనిసరిగా ఉండాలని బీవీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఈసంపల్లి రాకేష్ సూచించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో రెండు రోజులు కొత్తగూడెం అసెంబ్లీ బీవీఎఫ్ శిక్షణ తరగతులు స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్ చేతుల మీదుగా బహుజన్ వలంటరీ ఫోర్స్ (బీవీఎఫ్) టీ-షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కావాలంటే యువత భాగస్వామ్యం కావాలని బహుజన్ బీవీఎఫ్‌ను ఏర్పాటు చేశారన్నారు. బీవీఎఫ్‌లో యువత చేరి తమ భవిష్యత్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జర్పుల కళ్యాణ్, గుగులోత్ రాహుల్, ఎర్రంశెట్టి ఉపేందర్, ధనుంజయ్, పూర్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

ఇల్లెందు: సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపుసంఘం ఎన్నికలు వాయిదా వేయడం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలో భాగమేన్నారు. డీవైసీఎల్‌సీ వద్ద జరగాల్సిన కార్మిక సంఘాల సమావేశం వాయిదా వేశారని, యాజమాన్యం అడ్డుపడటం వల్లే కార్మిక సంఘాల సమావేశం రద్దు చేశారన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రాసుద్దీన్, రాంసింగ్, కె.శ్రీనివాస్, ఎల్. రవి, లింగయ్య, మంద లక్ష్మీనారాయణ, సక్కు, కాంతారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి


సింగరేణి కొత్తగూడెం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: హుజురాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో జర్నలిస్టును దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సదానందం, బోళ్ల సాగర్ అన్నారు. శనివారం సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గుళ్ల పోషయ్య, పెండ్యాల రాజు, గాజుల సతీష్, బి.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి క్రిష్టయ్య పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): జర్నలిస్టును అసభ్యపదజాలంతో తిట్టి దాడి చేసిందుకుగాను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని సొప్పరి తెలంగాణ క్రాంతి ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బండారి నాగేశ్వరరావు, మామిడి రాజేశ్వరరావు, పరుశురాములు, సారా మహేష్, పిట్టల రవి, లక్ష్మణ్, సొప్పరి సతీష్ పాల్గొన్నారు.

చుంచుపల్లి: స్థానిక రుద్రంపూర్ సెంటర్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఆలయంలో సినిమా షూటింగ్ ప్రారంభం


ఆలయంలో చిత్రయూనిట్

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎస్‌కేసీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ నంబర్ 5 ఆధ్వర్యంలో నూతన చిత్రం పూజా కార్యాక్రమాలు శనివారం వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. బిగ్‌బాస్ ఫేం, సీనియర్ నటి జ్యోతి సందడి చేసింది. . ఈ సందర్భంగా ముహూర్తపు సన్నివేషాన్ని బీఆర్‌ఎస్‌వీ నియోజక వర్గ అధ్యక్షులు బత్తుల మధుచంద్ కెమెరా స్విచ్ ఆన్ చేసి షూటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం దర్శక నిర్మాత సతీశ్, కో డైరెక్టర్ జయదీప్, చైతు, కిలారి సుజాత, కళావతి, ఖాజా మొయినుద్దీనఖ్, కంచర్ల రామారావు, పద్మావతి, మల్లేశ్వరి, కమలా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి 'సికిల్ సెల్' అంతం

టేకులపల్లి: 2047 సంవత్సరం కల్లా జన్యుపరంగా సోకే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని భారత సమాజం నుండి నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పైలెట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. శనివారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఈనెల 26 నుంచి పది రోజులపాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు టీములు పరీక్షలు చేస్తారన్నారు. ఫేజ్ 1లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు, ఫేజ్ 2లో 0–40 సంవత్సరాల వయసు వారికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన పిల్లల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రత్యేకమైన వైద్యం ఇవ్వడంతో పాటు ఉచితంగా రక్తం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీతమ్మ, పార్వతి, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జ విజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్‌కు జిల్లా జడ్జి అభినందన


పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: ఆల్ ఇండియా స్థాయిలో జేఈఈ 1111 ర్యాంక్ సాధించిన బోడ పవన్ కుమార్‌ను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ అభినందించారు. పవన్‌కుమార్ తండ్రి వీరుతో జడ్జిని కలవడంతో పవన్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అనితావాని, రామ్‌శెట్టి రమేష్, బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ యాస యుగంధర్, జిల్లా ఏఓ అనిత, రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సుజాతనగర్: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 22 పోలింగ్ స్టేషన్లు ఉండగా పోలింగ్ కేంద్రాల్లోని ర్యాంపులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలను పరిశీలించారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా 18 ఏళ్లు నిండిన వారికి అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యు.సునీల్‌రెడ్డి, సీఐ రమాకాంత్, ఎస్సై పి.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 21న ఇంటి నుంచి పెరుగు కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని బాలిక తల్లి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'సీఈఐఆర్'ను వినియోగించుకోవాలి

ఇల్లెందు: పోగొట్టుకున్న ఫోన్‌ను కనిపెట్టటానికి వాడే సీఈఐఆర్ పోర్టల్ నూతన టెక్నాలజీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ టి.కరుణాకర్ అన్నారు. రెండు రోజులకు క్రితం ఓ యువతి పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్‌తో కనిపెట్టి శనివారం తనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్ కొనుగోలు చేసినప్పుడు వివరాలు దాచి పెట్టుకోవాలన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం


మహిళకు చీర పంపిణీ చేస్తున్న దృశ్యం

సుజాతనగర్: 'డాన్ టూ డస్క్' కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో మూడు విభాగాలకు చెందిన వారిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళ, రైతు, పోలీసు అధికారిని సన్మానించారు. విత్తనాలు, నిత్యావసర సరుకులను అందజేయడంతో పాటు, సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు.

కేఎల్‌ఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పాల్వంచ: స్థానిక కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మూడు రోజులుగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పలు ఎంఎన్‌సీ కంపెనీల్లో 150 విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వీరికి శనివారం కళాశాల ప్రాంగణంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ కె.నాగమణి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ పి.రమేశ్‌లు విద్యార్థులను అభినందించారు.

అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్


ప్రచారం చేస్తున్న రవి

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుబాటులోకి వస్తుందని కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ జి.రవి తెలిపారు. శనివారం పార్టీ మండలాధ్యక్షుడు భూక్య దేవానాయక్ ఆధ్వర్యంలో జరిగిన హాథ్ సే హాథ్ పాదయాత్రలో నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు భూక్య దేవా నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బి.ఎన్. గోపాల్, పట్టణ కమిటీ బీసీ సెల్ అధ్యక్షులు ఆనంద్, ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా కో కో ఆర్డినేటర్ అరవిందస్వామి, సూరజ్, ఇల్లెందు పట్టణ కమిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాషా, మండల కమిటీ మహిళా అధ్యక్షురాలు ఆకారపు స్వప్న, సురేష్, నరేష్, ధర్మ, అర్జున్, నాయకులు బానాల శ్రీనివాస్, పసిక తిరుమల్, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ ధరావత్ కృష్ణ, జమీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం స్థానిక బాక్స్ ఆఫీస్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా చేపూరి బ్రహ్మచారి, కార్యదర్శిగా మాడిశెట్టి రాజా మనోహర్, కోశాధికారిగా కాటా నవీన్‌లతో కమిటీ సభ్యులను ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ అమ్మతలూరి కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎడవల్లి కృష్ణ, ఆరుద్ర సత్యనారాయణ, చాట్ల శ్రీనివాసరావు, పాకాలపాటి రోశయ్య చౌదరి, పుట్టా నాగేశ్వరరావు, పోట్రు సతీష్, సమీర్, నారాయణ, రాంబాబు, శ్రీదేవి, కనకరాణి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం..


రహదారిపై కూలిన చెట్టు

ఇల్లెందురూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాలలో శనివారం తెల్లవారుజాము నుంచి మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. విత్తనాలు విత్తుకునేందుకు అనువుగా నేలలో తేమశాతం చేరుకోవడంతో అన్నదాతలు దుక్కులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. విత్తనాల కోసం దుకాణాల వద్దకు పరుగులు తీశారు. ఇదిలా ఉండగా భారీ వర్షం వల్ల మండలంలోని మస్సివాగు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో చెట్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో సుమారు రెండు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. గ్రామపంచాయతీ సిబ్బంది చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

'ఖరీఫ్' పనులు షురూ..

- పెరగనున్న పత్తి సాగు
- విత్తనాలు విత్తడంలో రైతులు నిమగ్నం


పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

జూలూరుపాడు: నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో తొలకరి వాన పలకరించింది. దీంతో మండలంలో ఖరీఫ్ పంటల సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పొలాలను ట్రాక్టర్లతో వేసవి దుక్కులు దున్ని పంటలకు సాగు సిద్ధం చేశారు. రైతులు ట్రాక్టర్లతో గొర్రు తోలి, అరకతో అచ్చుతోలి పత్తి విత్తనాలు కూలీలతో వేయిస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి సాగుపై మొగ్గు చూపుతున్న కొంతమంది రైతులు పత్తి విత్తనాలు విత్తారు. అయితే పలు గ్రామాల్లోనే రైతులు పొడి దుక్కిల్లోనే పత్తి విత్తనాలు వేశారు. మిరప నారుమడులు సిద్ధం చేసి విత్తనాలు నాటారు. గతేడాది కంటే ఈ ఏడాది పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా గత ఏడాది మిర్చి తోటలకు వైరస్ సోకి పంట దిగుబడి తగ్గినప్పటికీ ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో మంచి ధర లభించడంతో గతేడాది కంటే ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం అంతగా తగ్గే అవకాశం కన్పించడం లేదు. ఇప్పటికే రైతులు పత్తి, మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి ఉంచుకున్నారు. పత్తి, మిర్చితోపాటు కూరగాయాల సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.


మిరప నారుమడులు సిద్ధం చేస్తూ..


అచ్చు తోలుతున్న రైతు